క్లుప్తంగా

రక్తదాన శిబిరం విజయవంతం



ఆర్టీసీ డిపోలో నిర్వహిస్తున్న రక్తదాన శిబిరం

సాలూరు: రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా పట్టణంలోని ఆర్టీసీ డిపోలో బుధవారం నిర్వహించిన రక్తదాన శిబిరం విజయవంతమైందని ఆర్టీసీ డీఎం భాస్కరరెడ్డి తెలిపారు. మోటార్‌వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాదరావు చేతుల మీదుగా ప్రారంభించిన ఈ రక్తదాన శిబిరంలో 17 మంది ఉద్యోగస్తులు రక్తదానం చేశారని తెలిపారు. కార్యక్రమంలో ఏరియా ఆస్పత్రి వైద్యులు డా.సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రఘువర్మకు తొలి ప్రాధాన్యత ఓటు వేయాలి



పట్టణంలోని చర్చివీధిలో ప్రచారం చేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

పార్వతీపురం: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీచేస్తున్న పాలకపాటి రఘువర్మకు మొదటి ప్రాధాన్యత ఓటును వేసి గెలిపించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మర్రాపు మహేష్ కోరారు. ఈ మేరకు బుధవారం పట్టణంలోని చర్చివీధిలో ఉన్న పలువురు ఉపాధ్యాయులను కలిసి మద్దతు కోరారు. ఈ పర్యటనలో సంఘం నాయకులు తిరుపతిరావు, గోపాలకృష్ణ, ఆనందగజపతి, బీవీఏ నాయుడు, రోహిణికుమార్, అప్పలనాయుడు, స్వామినాయుడు, మంగయ్య, సంతోష్, జగదీష్, మోహన్, జోగారావు, శ్రీను, రమణ, తిరుమల తదితరులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

పార్వతీపురంరూరల్: మాఘపౌర్ణమి సందర్భంగా బుధవారం మండలంలోని సంగంవలస గ్రామంలో గల రామమందిరంవద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ప్రాతఃకాల పూజలను నిర్వహించిన అనంతరం మహిళలతో కుంకుమపూజలు చేయించారు. ఈ సందర్భంగా భక్తులకు ప్రసాదాలను వితరణ చేశారు. స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా యువత అవసరమైన ఏర్పాట్లు చేశారు.

గిరిజనుల మనోభావాలు దెబ్బతీసేలా స్పీకరు వ్యాఖ్యలు

- మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి

జియ్యమ్మవలస రూరల్: ఏపీ శాసనసభ స్పీకరు చింతకాయల అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలు గిరిజనుల మనోభావాలు దెబ్బతీసేలా ఉన్నాయని మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి అన్నారు. ఇదే విషయమై ఆమె మండలంలోని చినమేరంగి గ్రామంలోని తన క్యాంపు కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. గిరిజనులకు రక్షణ కవచం లాంటి 1/70 చట్టాన్ని సవరణ చేయాలని స్పీకరు మాట్లాడడం బాధాకరమన్నారు. ఆ చట్టాన్ని సవరిస్తే గిరిజనుల భూములు గిరిజనులకు దక్కకుండా పోతాయని, ఏజెన్సీలో లభించే సహజ వనరులు కార్పొరేట్ శక్తుల చేతుల్లోకి వెళ్లిపోతాయన్నారు. గిరిజనుల హక్కులపై గిరిజనేతరుల పెత్తనం లేకుండా ఈ చట్టం చేయడం జరిగిందన్నారు. స్పీకరు వ్యాఖ్యలను నిరసిస్తూ మన్యం బంద్‌కు పిలుపునిస్తే అధికారులు, నాయకుల బెదిరింపులతో బంద్‌ను విరమింపజేసే ప్రయత్నానికి ఒడిగట్టారన్నారు. ఇప్పటికైనా స్పీకరు గిరిజనులకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి 2002లో జీవో నంబర్ 3 రద్దు అయినట్లు ఇచ్చిన ప్రకటన అవగాహన రాహిత్యమన్నారు. 2020 జూలై 7న సుప్రీంకోర్టులో జీవో నంబర్ 3పై అప్పట్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రివ్యూ పిటిషన్ వేసిందన్నారు. అదే జీవో నంబర్‌పై మరో 16 రివ్యూ పిటిషన్లు సుప్రీంకోర్టులో వేయగా, 2024 ఏప్రిల్ 3న అన్ని రివ్యూ పిటిషన్లను కోర్టు కొట్టి వేసిందని ఈ విషయాన్ని కూటమి నాయకులు తెలుసుకోవాలన్నారు. గతంలోని తమ ప్రభుత్వం పిటిషన్లు వేయలేదని ఏజీతో చెప్పించగలరా అని ప్రశ్నించారు. నిరాధారమైన ఆరోపణలు చేసి ప్రజలను పక్కదోవ పట్టించే ప్రయత్నాలు మానుకోవాలన్నారు. ఎంపీపీ దీనమయ్య, మొండెంఖల్లు ఎంపీటీసీ గుడారి విద్యారాణి, కురుపాం జెడ్పీటీసీ గొర్లి సుజాత, ఎల్విన్‌పేట సర్పంచ్ చైతన్య ప్రవంతి పాల్గొన్నారు.

మన్యం బంద్ విరమణ తాత్కాలికమే..

సీతంపేట: మన్యం బంద్ విరమణ తాత్కాలికమేనని ఆదివాసీ జేఏసీ జిల్లా అధ్యక్షుడు బి.శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో బుధవారం గిరిజన సంఘాల నాయకులతో సమావేశమయ్యారు. బంద్ చేస్తున్నామనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి గిరిజన చట్టాలపై సానుకూలంగా స్పందించారు తప్ప స్పష్టమైన హామీ ఇవ్వలేదన్నారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకుని గిరిజనులకు బేషరతుగా క్షమాపణ చెప్పాలన్నారు. లేదంటే గిరిజనులను హేళన చేసిన స్పీకర్‌పై అట్రాసిటీ కేసు పెట్టడానికి న్యాయనిపుణులతో చర్చించనున్నామన్నారు.

1/70 చట్టంపై అసెంబ్లీలో ప్రకటన చేయాలి

సాలూరు:

ఫిబ్రవరి 24నుంచి జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో 1/70 చట్టం అమలుపై రాష్ట్ర ప్రభుత్వం ప్రకటన చేయాలని ఆదివాసీ అఖిల పక్ష రాజకీయ, ప్రజాసంఘాల వేదిక సభ్యులు డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం పట్టణంలోని మెయిన్‌రోడ్డు వద్ద గల బోసు బొమ్మ వద్దకు ఆదివాసీ గిరి జన సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు, జేఏసీ నాయకుడు సీదరపు అప్పారావు, సుందరరావు తదితరులు చేరుకుని మాట్లాడుతూ, 1/70 చట్టాన్ని యథాతథంగా అమలు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించిన నేపథ్యంలో బంద్ విరమించుకున్నట్లు పేర్కొన్నారు. ఈ అసెంబ్లీ సమావేశాల్లో స్థానిక ఆదివాసీలకు 100 శాతం ఉద్యోగ, ఉపాధ్యాయ రిజర్వేషన్ల చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ వెంటనే ప్రకటించాలని, పాడేరు మెడికల్ కాలేజీలో స్థానికులతోనే ఉద్యోగాల భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కొండగొర్రు ఉదయ్‌కుమార్, అన్నోజిరావు, రెడ్డి వేణు, మర్రి శ్రీనివాసరావు, అయోధ్య, జానకిరావు తదితరులు పాల్గొన్నారు.



పార్వతీపురం టౌన్: పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి వద్ద నిరసన తెలుపుతున్న అఖిల పక్షాల నాయకులు



సాలూరు: మాట్లాడుతున్న నాయకులు

గిరిజన చట్టాల జోలికొస్తే ఊరుకోం

పార్వతీపురం టౌన్: గిరిజన చట్టాల జోలికి వస్తే ఊరుకునేదిలేదని సీపీఎం రాష్ట్ర నాయకుడు ఎం.కృష్ణమూర్తి హెచ్చరించారు. గిరిజనులకు రక్షణ కవచంగా ఉన్న 1/70చట్టంపై ఇటీవల విశాఖలో జరిగిన పర్యాటక పెట్టుబడిదారుల సదస్సులో స్పీకర్ అయ్యన్న పాత్రుడు చేసిన వ్యాఖ్యలపై ఆదివాసీ అఖిల పక్ష ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రెండు రోజులపాటు తలపెట్టిన సందర్భంగా బుధవారం సుందరయ్య భవనం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు విజయవంతంగా ర్యాలీ నిర్వహించారు. పార్టీలకతీతంగా ఆదివాసీలు సంఘాలు, ప్రజా సంఘాలు, వామపక్ష పార్టీలు స్వచ్ఛందంగా కలిసి రావడంతో ప్రభుత్వం వెనక్కు తగ్గి 1/70చట్టం జోలికి గాని, గిరిజన చట్టాల జోలికి గాని, హక్కుల జోలికి గాని వెళ్లబోమని ముఖ్యమంత్రి చేసిన ప్రకటనతో బంద్ విరమించారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకుడు కె.రామస్వామి, అయ్యర్ల సంఘం అధ్యక్షుడు పి.సంఘం, రైతుకూలీ సంఘం అధ్యక్షుడు భాస్కరరావు, బొత్స నరసింగరావు, పి.రామని, పోల ఈశ్వరరావు ,పి.రాము వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, జి.వెంకటరమణ, సీఐటీయూ నాయకుడు సూరిబాబు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో తప్పుడు హాజరు వేస్తే కఠిన చర్యలు

- కూలీల సంఖ్య 10వేలకు పెరగాలి
- ఎంపీడీఓ గొల్లపల్లి పార్వతి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ పార్వతి

సాలూరు రూరల్: మండలంలో ఉపాధి హామీ పనులకు వచ్చిన కూలీల హాజరు తప్పుగా నమోదు చేసినట్లయితే సంబంధిత సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ గొల్లపల్లి పార్వతి ఉపాధి పనుల పర్యవేక్షణ సిబ్బందిని హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లతో పాటు ఇతర సిబ్బందితో ఎంపీడీఓ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధి హామీ పనుల్లో అవకతవకలకు చోటు ఇవ్వకూడదని తప్పుడు హాజరు నమోదు చేసిన సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటానని చెప్పారు. అలాగే ఏజెన్సీ గ్రామాల్లో ఎక్కువగా పనులు కల్పించాలని ఆదేశించారు. మండలంలోని ఉపాధి కూలీల శాతం పెరగాలని, ఆ సంఖ్య 10వేలకు చేరాలని స్పష్టం చేశారు. తొలుత పంచాయతీల వారీగా సమీక్ష నిర్వహించారు. ఆయా పంచాయతీల్లో జరుగుతున్న పనుల వివరాలతో పాటు కూలీల సంఖ్యను అడిగి తెలుసుకున్నారు.కార్యక్రమంలో మండల కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రీ వేగవంతం చేయాలి

సీతానగరం: రైతుల కోసం వ్యవసాయ శాఖ నిర్వహిస్తున్న ఫార్మర్ రిజిస్ట్రీ అమలులో భాగంగా బుధవారం గుచ్చిమి రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ సహాయకుడు నిర్వహిస్తున్న ఫార్మ ర్ రిజిస్ట్రీ కార్యక్రమాన్ని డీఏఓ రాబర్ట్‌పాల్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధి(డీఏఓ)కారి రాబర్ట్‌పాల్ మాట్లాడుతూ 15 మండలాల్లో 25,857 మంది రైతుల రిజిస్ట్రేషన్ పూర్తయిందని తెలిపారు. సీతానగరం మండలంలోని 3 వేల మంది రైతులు రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకున్నారన్నారు. జిల్లా వ్యాప్తంగా నిర్దేశించిన గడువులోగా ఈ పోర్టల్‌లో రైతుల నుంచి రిజిస్ట్రేషన్స్ చేయనున్నామ ని, అధికారులు, రైతులు సహకరించి వ్యవసా సహాయకులకు అవసరమైన సమాచారాన్ని ఇవ్వాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఓ ఎస్.అవినాష్, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

దాలినాయుడికి డిప్యూటీ సీఎం పరామర్శ



దాలినాయుడిని పరామర్శిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు: పట్టణంలోని 17వ వార్డు మాజీ కౌన్సిలర్ ఎర్ర దాలినాయుడిని మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర బుధవారం పరామర్శించారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న దాలినాయుడిని పట్టణంలోని ఆయన గృహానికి రాజన్నదొర వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. రాజన్నదొర వెంట పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

అక్రమంగా హెచ్‌ఎంపై విధించిన సస్పెన్షన్ ఎత్తివేయాలి



జిల్లా విద్యాశాఖ అధికారి వారి కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

పార్వతీపురంటౌన్: మున్సిపాలిటీ పరిధిలో గల కొత్తవలస పురపాలక ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిపై అక్రమంగా విధించిన సస్పెన్షన్ ఎత్తి వేయాలని సీపీఎం సీనియర్ నాయకుడు ఎం.కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక జిల్లా విద్యాశాఖ అధికారి వారి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఉన్నతాధికారులకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో నియమించిన కార్మికుల పట్ల నేటి ప్రభుత్వంలోని రాజకీయ నాయకులు వ్యవహరిస్తున్న తీరు సరైనది కాదని మండిపడ్డారు. ఎటువంటి కారణం లేకుండా కార్మికులను తొలగించాలని, ప్రజా ప్రతినిధులతో సహా జిల్లా విద్యాశాఖ అధికారులు కూడా మొండిగా వ్యవహరించడం అన్యాయమన్నారు. విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు కూడా పాత వారినే కొనసాగించాలని గత తల్లిదండ్రుల కమిటీ సమావేశంలో నిర్ణయించుకున్నట్లు తెలిపారని, అయినప్పటికీ రాజకీయ నాయకులు కలగజేసుకుని తాము నిర్ణయించిన వారినే వంటవారిగా నియమించాలని, వారికి మాత్రమే వంట సామగ్రి అందివ్వాలని ప్రధానోపాధ్యాయుడిని ఒత్తిడికి గురిచేయడం సరికాదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, సీఐటీయూ నాయకులు బి.సూరిబాబు, గిరిజన సంఘం నాయకుడు పాలమిట్ట రాము తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభల్లో వచ్చిన అర్జీల పరిష్కారమే ధ్యేయం



మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రసన్నకుమార్

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో ఇటీవల నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను దశల వారీగా సమస్య తీవ్రతను బట్టి పరిష్కరించనున్నట్లు తహసీల్దార్ ప్రసన్న కుమార్ అన్నారు. ఈ మేరకు బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో హెచ్‌డీటీ ఉమామహేశ్వరరావు, ప్రత్యేకాధికారి పర్యవేక్షణలో గ్రామస్థాయిల్లో జరిగిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల నుంచి వచ్చిన అంశాలను పరిష్కరించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలియజేశారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు లచ్చయ్యపేటలో జరుగుతున్న రీసర్వే నిష్పక్షపాతంగా నిర్వహించనున్నామని చెప్పారు. రైతులకు సంబంధించిన జిరాయితీ భూముల వివరాలను రీసర్వేకు వచ్చిన వారికి అవసరమైన సమాచారం ఇచ్చి సహకరించాలని సూచించారు.

గర్భిణుల ఆరోగ్యమే లక్ష్యంగా పనిచేయాలి



గర్భిణులకు పౌష్టికాహార కిట్లు అందజేస్తున్న డీఎంహెచ్‌వో భాస్కరరావు

గుమ్మలక్ష్మీపురం: గర్భిణుల ఆరోగ్యమే లక్ష్యంగా పనిచేయాలని డీఎంహెచ్‌వో ఎస్.భాస్కరరావు సూచించారు. మండలంలోని తాడికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన బుధవారం సందర్శించారు. ఆస్పత్రిలో రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, సిబ్బంది పనితీరు పరిశీలించి, పలు సూచనలు చేశారు. రక్తహీనతతో బాధపడుతున్న మారుమూల గిరిజన గ్రామాలకు చెందిన 10 మంది గర్భిణులను దత్తత తీసుకుని, వారికి పౌష్టికాహార కిట్లు, వారి ఆరోగ్యం తదితర విషయాలను తరచూ పరిశీలించడం జరుగుతుందన్నారు. వైద్యాధికారులు కూడా రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులను దత్తత తీసుకుని, వారి ఆరోగ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రసవ తేదీలకు ముందుగానే గర్భిణులను వసతిగృహాలకు చేర్చాలన్నారు. అనంతరం ఫీడర్ అంబులెన్స్ సేవలపై ఆరాతీశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు ఎం.బుద్ధేశ్వరరావు, అభిలాష్, డీఎస్‌వో శంకర్ పాల్గొన్నారు.

జియ్యమ్మవలస: స్థానిక పీహెచ్‌సీని డీఎంహెచ్‌వో ఎస్.భాస్కరరావు బుధవారం సందర్శించారు. రోగులకు అందిస్తున్న వైద్యం, సిబ్బంది పనితీరు, రికార్డులు పరిశీలించి, పలు సూచనలు చేశారు. అనంతరం మారుమూల గిరిజన గ్రామాలకు చెందిన 10 మంది గిరిజన గర్భిణులను దత్తత తీసుకుని, వారికి పౌష్టికాహార కిట్లు అందజేశారు. వైద్యాధికారులు రక్తహీనతతో బాధపడే గర్భిణుల ఆరోగ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఐసీఐసీఐ బ్యాంకు ప్రారంభం



సిబ్బందితో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్: జిల్లా కేంద్రం పార్వతీపురంలోని బెలగాం ప్రాంతంలో గల ఐసీఐసీఐ బ్యాంకు బ్రాంచ్ ఇటీవల ఆధునికీకరణ పనులు పూర్తి చేసుకున్న సందర్భంగా ఎమ్మెల్యే అలజంగి జోగారావు బుధవారం ఆ బ్రాంచిని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంగా అవతరించిన అనంతరం బ్యాంకు సేవలు విస్తరించి కస్టమర్లకు మరిన్ని ఎక్కువ సేవలు అందించే ఉద్దేశంతో బ్యాంకును ఆధునికీకరించి ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా తీర్చి దిద్దడం శుభ పరిణామన్నారు. కస్టమర్లకు మెరుగైన సేవలందించాలని బ్యాంకు సిబ్బందికి సూచించారు. వ్యాపార అభివృద్ధి బాగా జరగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, మున్సిపల్ వైస్‌చైర్మన్ యిండుపూరు గున్నేశ్వరరావు, బ్యాంక్ మేనేజర్ ఎం.డి. సంపు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాలకు కళ్లెం



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ మురళీధర్

పార్వతీపురం టౌన్: ప్రజలు తమ ఇళ్లు, వ్యాపార సంస్థల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే నేరాలకు కళ్లెం పడుతుందని పట్టణ సీఐ మురళీధర్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమాశంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఇప్పటికే 500 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, ప్రజల భాగస్వామ్యంతో మరిన్ని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామన్నారు. నేరస్తులను ముందుగా గుర్తించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆధునిక సీసీటీఎన్ఎస్ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. ప్రజలు అవగాహన పెంచుకుని, అప్రమత్తంగా ఉంటే సైబర్ నేరాలను అరికట్టవచ్చన్నారు. పోలీసుల పేరుతో సైబర్ నేరగాళ్లు వీడియో కాల్ చేసి, డిజిటల్ అరెస్ట్ పేరిట భయభ్రాంతులకు గురిచేసి, వారి ఖాతాల నుంచి నగదు దోచుకుంటున్న ఘటనలున్నాయని, డిజిటల్ అరెస్ట్ అనేదే లేదన్న విషయాన్ని ప్రజలు గమనించాలని సూచించారు. కళాశాలల స్థాయిలో ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాదకద్రవ్యాలపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. మాదక ద్రవ్యాలు సరఫరా చేసే వారి సమాచారం తెలుసుకుని పోలీసులకు అందజేయాలని కోరారు.

ఏపీఈఈ యూనియన్ ప్లాటినం జూబ్లీ వేడుకలు



ప్లాటినం జూబ్లీ వేడుకలు జరుపుకుంటున్న ఏపీఈఈ యూనియన్ నాయకులు

పార్వతీపురంటౌన్: ఏపీఈఈ (ఏపీ ఎలక్ట్రిసిటీ) యూనియన్ 75 వసంతాలు పూర్తి చేసుకుని 76వ వసంతంలోనికి ప్రవేశిస్తున్న సందర్భంగా జట్టు ఆశ్రమంలో నిత్యావసర సరుకులు, పండ్లు పంపిణీ చేశారు. రైతు బజార్ దగ్గరలో గల నిరాశ్రయుల వసతి గృహంలో అన్నదాన కార్యక్రమం, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ కార్మికుల శ్రేయస్సే పరమావధిగా నిరంతరం పనిచేస్తూ, కార్మికుల పక్షపాతిగా ఉంటూ, ఎన్నో కుటుంబాల్లో వెలుగులు నింపిన ఘనత తమ యూనియన్‌దేనన్నారు. మన భవిష్యత్తు కోసం రాబోయే తరాల వారి భవిష్యత్తు కోసం మనమందరం ఐక్యమత్యంగా ఉంటూ న్యాయమైన హక్కులు సాధించే విధంగా ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఎస్.వెంకటేశ్వర్లు, రెడ్డి శ్రీధర్, సీహెచ్ సత్యనారాయణ, పీవీ నారాయణరావు, ఎస్.ప్రవీణ్ కుమార్, పి.రాములు, క్రియాశీలక కార్యకర్తలు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకర మలుపు



ప్రమాదకరంగా ఉన్న వెలగవలస కూడలి వద్ద దండిగాం రోడ్డు మలుపు

సాలూరు రూరల్: మండలంలోని మైదాన ప్రాంత రోడ్లతో పాటు ఏజెన్సీ ప్రాంతాల్లో రోడ్లు, బ్రిడ్జిలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చాలావరకు పూర్తయిన విషయం తెలిసిందే. అందులో భాగంగా గంగన్నదొర వలస కూడలి నుంచి దండిగాం వరకు బీటీ రోడ్డు పనులు దాదాపు పూర్తయ్యాయి. అయితే మూడు కల్వర్టు పనులు మధ్యలో ఆగిపోవడంతో ప్రస్తుతం ఆ కల్వర్టులకు ఇరువైపులా ఉన్న గోతులతో వాహనచోదకులకు ఇబ్బందికరంగా మారింది. నిత్యం భారీ వాహనాలతో పాటు ద్విచక్రవాహన చోదకులు తిరుగుతుంటారు. అయితే వెలగవలస కూడలి వద్ద రోడ్డు పూర్తిగా మలుపు ఉండడంతో పాటు ఆ ప్రాంతంలో కల్వర్టు నిర్మాణం జరగాల్సి ఉంది. అక్కడి వరకు బీటీ రోడ్డుపై ప్రశాంతంగా వచ్చే వాహన చోదకులు ఒక్కసారిగా ఈ మలుపుతో పాటు గోతులు రోడ్లతో ఇబ్బందికి గురవుతున్నారు. ఎదురుగా వచ్చిన వాహనాలు ఈ మలుపు వద్ద దగ్గరకు వచ్చినంతవరకు కనిపించవు. దీంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎన్నికల కోడ్ కారణంగా ఆగిన పనులను ప్రస్తుత కూటమి ప్రభుత్వం చొరవచూపి పూర్తిచేయాలని పలువురు కోరుతున్నారు. ఈ మలుపు వద్ద కల్వర్టు నిర్మాణం చేసి బీటీ రోడ్డు వేయాలని ఆయా గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రభుత్వ డిగ్రీకళాశాలను సందర్శించిన నాక్ బృందం



పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరాలు తెలుసుకుంటున్న నాక్‌బృందం

పార్వతీపురంటౌన్: జిల్లా కేంద్రంలో గల శ్రీవెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలను నాక్‌బృందం చైర్మన్ డాక్టర్ ఎస్.సత్యనారాయణ బుధవారం ఉదయం సందర్శించారు. కళాశాలలో ప్రిన్సిపాల్, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్, విభాగాల అధిపతులు, అధ్యాపకులు ఇచ్చిన పవర్ పాయింట్ ప్రెజెంటేషన్‌ను వీక్షించి, ముఖాముఖి నిర్వహించారు. కళాశాలలో ఉన్న లైబ్రరీ, లేబొరేటరీ, కంప్యూటర్ ల్యాబ్, క్రీడా మైదానం, గ్రీనరీ, పచ్చదనం పరిశుభ్రత, అన్ని రకాల మౌలిక సదుపాయాలను పరిశీలించారు. కళాశాలలో విద్యార్థులు చేపట్టిన పలు సాంస్కృతిక కార్యక్రమాలను పర్యవేక్షించారు. పూర్వవిద్యార్థుల సంఘం నాయకులు, పూర్వ విద్యార్థులతో మాట్లాడారు. ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వంటి సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాలను పరిశీలించారు. కళాశాలలో యోగా, కంప్యూటర్, ప్లేస్‌మెంట్ సెల్, కెరీర్ కౌన్సెలింగ్ కేంద్రం, విద్యార్థులతో ముఖాముఖి తదితర అంశాలను పరిశీలించారు. రెండు రోజులపాటు కళాశాలలో పలు అంశాలను పర్యవేక్షించనున్నట్లు నాక్ బృందం సభ్యులు తెలిపారు. వారు కోరిన అన్ని అంశాలను పూర్తి ఆధారాలతో సమగ్రంగా ప్రిన్సిపాల్, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్, అధ్యాపకులు అందజేస్తున్నారు. కళాశాలలో తరగతులను, విద్యార్థుల ల్యాబ్ పరీక్షలను, వారి నైపుణ్యాన్ని నాక్ బృందం పరిశీలించింది. పలువురు పూర్వ విద్యార్థులు కూడా హాజరై గడిచిన ఐదేళ్లలో జరిగిన అభివృద్ధిని వివరించారు. కార్యక్రమంలో మెంబర్ కోఆర్డినేటర్ డాక్టర్ చంద్రకాంత్ యత్నూర్, మెంబర్ డాక్టర్ సుభాష్ వడ్డుగలతో పాటు రీజనల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.శోభారాణి కళాశాలకు రాగా వారికి ప్రిన్సిపాల్ డాక్టర్ చింతల చలపతిరావు, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ బి.శాంతకుమారి, విభాగాల అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

భామిని: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని, స్నేహభావం పెంపొందుతుందని బత్తిలి ఎంపీటీసీ టింగ అన్నాజీరావు, ఎస్ఐ డి.అనిల్‌కుమార్ అన్నారు. మండలంలోని బత్తిలిలో స్పైక్ స్టార్ వాలీబాల్ టోర్నమెంట్ అంతర్ జిల్లా వాలీబాల్ పోటీలను వారు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోటీల్లో 40 జట్లు పాల్గొంటున్నాయని, పోటీ స్నేహపూర్వకంగా ఉండాలన్నారు. ఎస్టీ కార్పొరేషన్ డైరెక్టర్ నిమ్మల నిబ్బరం, రెల్లి సంఘ నాయకులు రాగోలు అశోక్, బాదాపు సుధాకర్, నిర్వాహకుడు రుంకు కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

పాలకొండ రూరల్: ఉన్నత లక్ష్యాలు సాధించే క్రమంలో పునాదిగా ఉండే పదో తరగతిలో ఉత్తమ ఫలితాల సాధనకై విద్యార్థులు కృషి చేయాలని ఎంఈఓ కురిటి సోంబాబు అన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ప్రీ పబ్లిక్ పరీక్షల నిర్వహణను బుధవారం ఆయన స్వయంగా పరిశీలించారు. ఇప్పటికే మండల పరిధిలో ఉన్న ప్రభుత్వ, ఇతర రంగాలకు చెందిన 15 ఉన్నత పాఠశాలల్లో బోధన పొందుతున్న 816 మంది విద్యార్థులు పబ్లిక్ పరీక్షలకు సిద్ధం అవుతున్నారన్నారు. శతశాతం ఫలితాలు రాబట్టేలా విద్యార్థులపై వ్యక్తిగత, సబ్జెక్టుల వారీగా ప్రమాణాల మెరుగుపై హెచ్‌ఎంలు పర్యవేక్షణ చేయాలన్నారు. చినమంగళాపురం, సి.సింగుపురం, పెద కాపువీధి, జెడ్పీ బాలికల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను సందర్శించిన ఎంఈఓ హెచ్‌ఎంలకు పలు సూచనలు చేశారు.

ఆలయ నిర్మాణానికి దాతల విరాళం

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం గ్రామదేవత శ్రీపైడిమారమ్మ ఆలయ నిర్మాణానికి కురుపాం ప్రాంతానికి చెందిన కార్డియాలజిస్ట్ ఐవీవీ ప్రసాద్‌లాల్, లక్ష్మీలాల్ దంపతులు రూ.3.5 లక్షలు, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు పల్ల సింహాచలంనాయుడు రూ.లక్ష, బూరుబు పైడిరాజు రూ.2 లక్షలు చొప్పున విరాళం ప్రకటించి, అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.